క్లుప్తంగా

నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలి



కేక్ కట్ చేస్తున్న తహసీల్దార్ ధృవకుమార్

చిలుకూరు : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ధృవకుమార్ కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొత్త సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీ, సీనియర్ అసిస్టెంట్ పుష్ప, ఆర్ఐలు మంత్రిప్రగడ సీతయ్య, శ్వేత, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

మోతె : మండలంలోని అన్నారిగూడెం, కరక్కాయలగూడెం గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.8 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అన్నారిగూడెం గ్రామ శాఖ అధ్యక్షుడు మేరమెట్ల వెంకటనారాయణ, మాజీ సర్పంచ్‌లు దున్నపోతుల ఆదినారాయణ, శీత శ్రీను, నాయకులు దుశ్చర్ల శ్రీనివాస్, కటికం శ్రీను, రెడ్డిమళ్ల సత్యం, ఆలకుంట్ల ముత్తయ్య, ముఖర్జి, తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలి

గరిడేపల్లి : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పూర్తిస్థాయిలో రైతులకు రుణమాఫీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం గరిడేపల్లి మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీ కాకపోవడంతో లక్షల మంది రైతులు బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారని తెలిపారు. ప్రభుత్వం అర్హులందరికీ రుణమాఫీ నగదు ఎప్పుడు జమ చేస్తుందో స్పష్టత ఇచ్చి రైతుల్లో గందరగోళం లేకుండా చూడాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోదాడరూరల్ : మండలంలోని దొరకుంట సబ్‌స్టేషన్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుకు గాను విద్యుత్ లైన్ పనులు చేస్తున్నందున శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ రూరల్ ఏఈ సైదా గురువారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని దొరకుంట, నెమలిపురి, బండపాలెం, తమ్మర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వెంకటేశ్వర్లుకు నివాళి



వెంకటేశ్వర్లు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

నడిగూడెం : మండలంలోని తెల్లబెల్లి గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మృతి చెందాడు. వెంకటేశ్వర్లు మృతదేహాన్ని గురువారం సీఐటీయూ నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ అనుబంధ సంఘం) జిల్లా ఉపాధ్యక్షుడు వల్లపు తిరుమలేష్ మాట్లాడుతూ.. వెంకటేశ్వర్లు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. నివాళులర్పించిన వారిలో జిల్లా కమిటీ సభ్యులు వల్లెపు శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి చిక్కుల్ల ఉపేందర్, నాయకులు మాతంగి వీరయ్య, గుంజ వెంకన్న, కోడి రమేష్, కిన్నెర చిట్టి, నరేష్, తిరపయ్య, లింగయ్య, సైదులు, వెంకటేశ్వర్లు, సలీం, సైదమ్మ, నర్సమ్మ, సుగుణ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెంలో బీఆర్‌ఎస్‌ను వీడిన ఆ పార్టీ నాయకులు ఎం.పెద నర్సయ్య, ఎం.ప్రవీణ్, ఎం.అంజి గురువారం తిరిగి సొంత గూటికే చేరారు. వారికి గ్రామ పార్టీ నాయకులు గులాబీ కండువాలను కప్పి బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకోటి రెడ్డి, పుల్లయ్య, ఎం.వెంకటరెడ్డి, మైబల్లి, మహత్యం, శ్రీనివాస్, నరేష్, బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్ర నిర్వహణపై నేడు సమావేశం

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా 8వ తేదీన నిర్వహించబోయే శోభాయాత్రపై చర్చించేందుకు శుక్రవారం ఆలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ కొండారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో పట్టణ ప్రముఖులు, భక్తులు ప్రజలు పాల్గొని తమ సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు.

గోపాలమిత్ర భవనానికి గ్రహణం!

- భవన నిర్మాణ పనులు ప్రారంభించి ఎనిమిదేళ్లు
- నిధులు సరిపోక కొన్నాళ్లు నిలిచినా.. జెడ్పీటీసీ చొరవతో పూర్తి
- తీరా పనులు పూర్తయ్యాక వరదలకు దెబ్బతిన్న వైనం
- మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని పాడి రైతుల వేడుకోలు



కూచిపూడిలో వరదలకు దెబ్బతిన్న గోపాల మిత్ర భవనం

కోదాడరూరల్ : మండలంలోని కూచిపూడిలో నూతనంగా నిర్మించిన గోపాలమిత్ర భవనానికి గ్రహణం పట్టుకుంది. ప్రభుత్వాలు మారుతున్నా భవనం మాత్రం ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఎనిమిదేళ్ల క్రితం గ్రామ శివారులో రూ.7.50 లక్షలతో గోపాలమిత్ర భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. నిధులు ఉన్నంత వరకు పనులు వేగంగానే జరిగాయి. కానీ నిధులు అయిపోయి, మిగత పనులకు నిధులు లేక అంతర్గత పనులు నిలిచిపోయాయి. ఎలక్ట్రికల్, శానిటేషన్, ఫ్లోరింగ్ వంటి పనులు మిగిలిపోయాయి. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోపాలమిత్ర భవనం పనులు పూర్తి చేయించాలనే పట్టుదలతో తాజా మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు దివంగత మందలపు కృష్ణకుమారి జెడ్పీ నిధుల నుంచి రూ.3 లక్షలు మంజూరు చేయించారు. మిగిలిన ఫ్లోరింగ్, టాయిలెట్స్ టైల్స్, ఎలక్ట్రికల్ పనులు కూడా పూర్తి చేయించారు. మరో 10 రోజుల్లో స్థానిక ఎమ్మెల్యే పద్మావతి చేతుల మీదుగా ప్రారంభించాలని ఏర్పాట్లు చేస్తుండగా సెప్టెంబర్‌లో వచ్చిన భారీ వరదలకు అంతర్గంగ వాగు ఉధృతితో భవనం ఓ వైపు పునాదులతో సహా దెబ్బతిన్నది. వరదలకు ఓ వైపు పిల్లర్‌తో సహా బయటపడి భవనం అడుగు భాగం కొట్టుకుపోయింది. దీంతో ఆ భవనం ప్రారంభానికి నోచుకోకుండా ఆగిపోయింది. సంబంధిత అధికారులు స్పందించి గోపాలమిత్ర భవనానికి మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని కూచిపూడి, కూచిపుడి తండా గ్రామాల పాడి రైతులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తాం



కూచిపూడిలో ప్రారంభానికి సిద్ధమైన గోపాల మిత్ర భవనం సెప్టెంబర్‌లో వచ్చిన వరదలకు దెబ్బతిన్నది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. మరమ్మతులకు నిధులు మంజూరైతే వెంటనే పనులు పూర్తిచేసి అందుబాటులోకి తెస్తాం.

– వీవీ రాంచందర్‌రావు, ఎంపీడీఓ, కోదాడ

హనుమాన్ ఆలయానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న అనూష, కుటుంబ సభ్యులు

మునగాల : మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర హనుమాన్ దేవాలయానికి మాజీ సర్పంచ్ దేవరం వెంకటరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమార్తె గజ్జెల అనూష్ –సంతోష్‌రెడ్డి దంపతులు గురువారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయంలో స్వామివారి ఊరేగింపు నిమిత్తం రథం కొనుగోలు చేసేందుకు ఈ విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ తూముల వీరస్వామికి అందజేసినట్లు దాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి గంధం అంజయ్య, వెంకటరెడ్డి కుటుంబసభ్యులు దేవరం పద్మ, దేవరం అండాళమ్మ, రామిరెడ్డి, సునీత, అలుగుబెల్లి సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూఇయర్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



మోతె : డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు



హుజూర్‌నగర్ : క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ సంపత్ రెడ్డి, తదితరులు

మోతె : మండలంలోని మామిళ్లగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ డైరీ, క్యాలెండర్‌ను బుధవారం ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు జి.నిర్మల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగ బలోపేతం, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డి.లాలు, మండల అధ్యక్షుడు శ్రీనయ్య, ప్రధాన కార్యదర్శి డి.నరేందర్, వెంకట్, నర్సింహారావు, యాదయ్య, చాంప్లా, సంధ్యారాణి, నళిని, రేణుక, కవిత, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటరావిఎరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

హుజూర్‌నగర్ : పట్టణంలోని బ్రహ్మకుమారీస్ మఠంలో గురువారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి.. స్థానికులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు అనిల్, యాదగిరి, మాలాద్రి, నాయకులు మంగమ్మ వీరారెడ్డి, వి.వీరారెడ్డి, ఎస్.చంద్రశేఖర్, పి.నాగేంద్రబాబు, పి.సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ సభ్యత్వ నమోదు



సభ్యత్వాలు చూపుతున్న విద్యార్థులు

మఠంపల్లి : గడిచిన 55 ఏళ్లుగా విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తుందని ఆ సంఘం డివిజన్ నాయకుడు ఎం.రాజు తెలిపారు. గురువారం మఠంపల్లి మండలంలోని బక్కమంతులగూడెం వద్ద గల కేజీబీవీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎస్‌ఎఫ్‌ఐ సభ్యత్వాలు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు స్వచ్ఛందంగా సభ్యత్వాలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ప్రదీప్, అశోక్, అంకిత, సునీత, అరవింద, శోభ, ప్రణీత, వీణ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో అన్నదానం



అన్నదానం చేస్తున్న దాత, నిర్వాహకులు

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్డులో గల గాలి రమేష్ నాయుడు అయ్యప్ప సన్నిధానంలో మాలధారులకు అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం గుడిబండకు చెందిన బెజవాడ శ్రీనివాసరెడ్డి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌నాయుడు, అయ్యప్ప స్వామి, తిరపతమ్మ మాలధారులు ఉన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతమ్మకు సన్మానం

నడిగూడెం : కోదాడ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నూతనంగా ఎంపికైన ఏపూరి తిరుపతమ్మను గురువారం నడిగూడెంలో మానవ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు గంటెపంగు నాగార్జున్, నాయకులు సుధీర్, రాహుల్, నవీన్‌కుమార్, నస్రుత్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కూలి రేట్లు అమలు చేయాలి



కార్మికుల సమావేశంలో పాల్గొన్న ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి రాము, నాయకులు

హుజూర్‌నగర్ : హమాలీ కార్మికులకు నూతన ఒప్పందం ప్రకారం కూలి రేట్లు అమలు చేయాలని ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి చింతకాయల రాము అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లో సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఎగుమతులు దిగుమతులకు సంబంధించిన నూతన రేట్లు అమలు చేసే జీఓ విడుదల చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రామరాజు, జానయ్య, లక్ష్మయ్య, వెంకన్న, ఎల్లయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సు సర్వీసులు



ఆర్టీసీ డిపోను సందర్శిస్తున్న ఆర్‌ఎం జానిరెడ్డి

భానుపురి : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 400 ప్రత్యేక బస్సు సర్వీసులను నడవనున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం జానిరెడ్డి తెలిపారు. గురువారం సూర్యాపేట కొత్త బస్టాండ్‌లో చేపట్టిన బస్టాండ్ ఆవరణ ఫ్లోరింగ్, మహాలక్ష్మీ టాయిలెట్స్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సంక్రాంతి పండుగకు సూర్యాపేట నుంచి హైదరాబాద్, నల్లగొండ, మిర్యాలగూడెం పట్టణాలకు ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో అన్ని ఆర్టీసీ డిపోల్లో రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహిస్తూ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. డిపో మేనేజర్ సురేందర్, సీఐ సైదులు, సిబ్బంది కిరణ్, ప్రభాకర్, ఆర్.వి.సింగ్, వెల్ఫేర్ బోర్డు సభ్యులు యూసుఫ్ పాల్గొన్నారు.

వైభవంగా అష్టోత్తర శత కలశాభిషేకం



వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

మేళ్లచెరువు : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మేళ్లచెరువు మండల కేంద్రంలోని శ్రీ గోదా భూనీళా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం అష్టోత్తర శత కలశాభిషేకం పూజలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గోపూజ, నిత్యార్చన, తిరుప్పావై 18 వ రోజు పాశుర విన్నపం నివేదన, మంగళ నీరాజనం మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నరగిరినాధుని రంగభట్టారాచార్యులు, తరుణ్, దత్తు, భక్తులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై సమావేశం ఏర్పాటు చేయాలి



కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్‌ను సన్మానిస్తున్న శివాలయ చైర్మన్, ఈఓ

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీస్వయంభు శంభులింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల సందర్భంగా నిర్వహించే మహాశివరాత్రి జాతర ఏర్పాట్లకు వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని దేవాలయ అధికారులు, చైర్మన్ కోరారు. ఈమేరకు గురువారం జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను శాలువాతో సన్మానించారు.

ఖాజా ఆశయాలు సాధిద్దాం



ఖాజా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న క్రీడాకారులు

కోదాడరూరల్ : కబడ్డీ క్రీడలో రాణించి కోదాడ ప్రాంతానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన ఖాజాభాయ్ ఆశయాలను సాధిద్దామని కబడ్డీ జాతీయ క్రీడాకారుడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండీ.మహబూబ్‌జానీ, షేక్.బషీర్ అన్నారు. గురువారం కోదాడ పట్టణంలో కబడ్డీ క్రీడాకారుడు ఖాజా 35వ వర్ధంతి సందర్భంగా ఆయన నివాసంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఖాజాను యువత ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో బగ్దాద్, భాజాన్, కాంపాటి శ్రీను, పంది తిరపయ్య, గంధం పాండు, కత్తి వెంకటరత్నం, శమీ, మునీర్, నిజాం, రహీం, సైదులు తదితరులు ఉన్నారు.

మహిళకు రక్తదానం

హుజూర్‌నగర్ : పట్టణంలో ఆపదలో ఉన్న మహిళకు రక్తం అవసరం కావడంతో తమ బంధువు రవీందర్ జనచైతన్య ట్రస్ట్ సభ్యులు పి.సాయి, పి.శివశంకర్‌ను సంప్రదించారు. వారు స్పందించి దాత ధనరాజ్‌తో మాట్లాడి రక్తదానం చేయించారు. దీంతో వారిని పలువురు అభినందించారు.

దేశ రాజకీయాల్లో ఏబీ బర్ధన్ పాత్ర కీలకం



ఏబీ బర్ధన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

హుజూర్‌నగర్ : దేశ రాజకీయాల్లో సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి ఏబీ బర్ధన్ పోషించిన పాత్ర కీలకమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఏబీ బర్ధన్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో సంకీర్ణ రాజకీయాలను సమర్థంగా నడిపిన నాయకుడు ఏబీ బర్ధన్ అని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కంబాల శ్రీనివాస్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లేశ్వరి, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, యల్లావుల రమేష్, జక్కుల శ్రీను, జడ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వెన్నగోపాలుడి అలంకారంలో శ్రీకృష్ణుడు



గోపాలుడి అలంకరణలో శ్రీకృష్ణుడు



పాశుర పఠనంలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని వివిధ దేవాలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం శ్రీసీతారామచంద్ర, వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణుడి మూలవిరాట్‌కు భక్తులు సమర్పించిన 11 కేజీల వెన్నతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. విష్ణు సహస్ర నామార్చన, పల్లకీసేవ నిర్వహించారు. శ్రీ జ్ఞాన సరస్వతి, అభయాంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీసూక్తం పారాయణం, వేదపఠనం, అష్టోత్తరాలు, పాశురపఠనం గావించారు. పూజారులు, అధికారులు, పాలవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బూరుగడ్డ ఆలయంలో మంజలి ఉత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ శ్రీలక్ష్మీనరసింహ, శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో గురువారం మంజలి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ఆరాధన, శ్రీగోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తికి పంచామృతాభిషేకం, తదిపరి సేవాకాలం నిర్వహించారు. అనంతరం ఆరగింపు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎరగాని గురువయ్య, ఈఓ ఎంపి లక్ష్మణ్‌రావు, ధర్మకర్తలు అంజయ్య, హరీష్‌కుమార్, కవిత, నరసింహారావు, కృష్ణప్రసాద్, హనుమంతరావు, అర్చకులు హరీష్‌కుమారాచార్యులు భక్తులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమ్మెలో పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, కార్మికులు

హుజూర్‌నగర్ : హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హుజూర్‌నగర్‌లో సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌లో పని చేసే హమాలీ కార్మికుల నిరవధిక సమ్మె గురువారం కొనసాగింది. ఈ సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రెండేళ్లకు ఒకసారి కూలి రేట్లు పెంచుతుందని తెలిపారు. సివిల్ సప్లయ్ అధికారులకు, కార్మిక సంఘాల మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం జీఓను విడుదల చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం జీఓ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు బి.సైదులు, పి.వెంకన్న, పి.గోపి, బాలాజి, భిక్షం, వెంకన్న, వీరేశం, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం సావిత్రీబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించాలని ఉత్తర్వులను జారీ చేయడం హర్షణీయమని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రాపోలు పరమేశ్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన సాధ్వీమణి సావిత్రీబాయి పూలే అన్నారు. విద్యా వ్యాప్తి కోసం ఆమె చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆమె జయంతిని అన్ని పాఠశాలల్లో ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

వసతి గృహం సందర్శన

మిర్యాలగూడ : పట్టణంలోని ఎస్సీ బాలికల వసతిగృహాన్ని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ గురువారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన వసతిగృహంలోని వంట గదిని, భోజనాన్ని పరిశీలించి విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులు సబ్‌కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కీత సావిత్రి, సంధ్యారాణిలు ఉన్నారు.

ఘనంగా మండల పూజ



వేంకటేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం గోవింద మాల భక్త బృందం ఆధ్వర్యంలో మండల పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్‌చక్రవర్తుల వేణుగోపాల ఆచార్యులు, అర్చక బృందం ఆధ్వర్యంలో స్వామి వారికి 108 కలశములతో తిరుమంజన స్నపనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పళ్ల రసాలు, శుద్ధోదకం, గంధోదకం, పుష్పోదకం, ఫలోదకం, దూపదీపాలతో మండల పూజ జరిపారు. అనంతరం భక్తులందరికీ అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు హరిచరణ్‌ఆచార్యులు, శ్రీహరి ఆచార్యులు, గోవింద మాల భక్తులు పాల్గొన్నారు.

ఇరుకు దారిలో వాహనదారుల అవస్థలు



ఇరుకుగా ఉన్న రామాపురం రోడ్డు



పెట్రోల్ బంక్ నుంచి వస్తున్న లారీ

- రామాపురం రోడ్డులో పెట్రోల్ బంక్‌కు నిత్యం లారీల రాకపోకలు
- ఎదురెదురుగా వాహనాలొస్తే రోడ్డు దిగే స్థలం కూడా లేని వైనం
- డబుల్ రోడ్డుగా మార్చాలని రైతుల వేడుకోలు

చిలుకూరు : మండల కేంద్రం నుంచి రామాపురం వెళ్లే రోడ్డు ఇరుకుగా మారింది. ఇరు పక్కలా ఏపుగా చెట్లు పెరిగి రోడ్డును కమ్మేశాయి. మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో వాహనాదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల ఈ రోడ్డులో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశారు. దీంతో నిత్యం ఈ రోడ్డులో లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రోడ్డు పూర్తిగా దెబ్బతింటుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దారిలో లారీ ఎదురుగా వస్తే పక్కకు దిగే స్థలం కూడా ఉండడం లేదని వాహనదారులు చెబుతున్నారు. అసలే యాసంగి సాగు సీజన్ కావడంతో ట్రాక్టర్లు ఎదురెదురుగా వచ్చినప్పుడు కూడా రైతులకు అవస్థలు తప్పడం లేదు. అయితే ఈ రోడ్డు వెంట చిలుకూరు, రామాపురం గ్రామాలకు చెందిన రైతుల పొలాలు ఉంటాయి. ఈ రోడ్డు నుంచి కోదాడ– జడ్చర్ల జాతీయ రహదారి నుంచి విజయవాడ– హైదరాబాద్‌కు కూడా వెళ్లవచ్చు. దీంతో ఈ రోడ్డు కొంత రద్దీగా ఉంటుంది. కావున ఈ రోడ్డును డబుల్ లైన్‌గా మార్చి వాహనదారుల ఇబ్బందులు తొలగించాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు రోడ్డుకు ఇరుపక్కలా కమ్మేసిన చెట్లను తొలగించాలని వేడుకుంటున్నారు.